
సాక్షి కర్నూలు

మంగళవారం । 27 । ఆగస్టు । 2024



పాహిమాం..సిద్ధేశ్వరా!

ఆలూరు: శ్రావణ మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని ఆలూరులో సిద్ధేశ్వరస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వీరశైవ లింగాయితీలు భారీగా తరలి వచ్చారు.



బనవాసి..'ఘనీకృత' కీర్తి

ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి ఘనీకృత వీర్య కేంద్రం ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. వరుసగా మూడో పర్యాయం 2024లో ఈ కేంద్రానికి ఏ-గ్రేడ్ వచ్చింది.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,628.72
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 87.620
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 17,311
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 10,075

న్యూస్‌రీల్

శ్రీమఠంలో గోకులాష్టమి వేడుకలు



ఊంజల మంటపంలో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో గోకులాష్టమి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. శ్రీమఠం ఊంజల మంటపంలో అక్షోభ్య మఠం ఉప పీఠాధిపతి అక్షోభ్య రామప్రియ తీర్థులు ఆశీస్సులతో వేడుకలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడి వేషధారణలో కనువిందు చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గోకుల కృష్ణుడి చరితను ప్రవచించారు. చిన్నారులకు వేషధారణ పోటీలు నిర్వహించగా.. న్యాయ నిర్ణేతగా మేనేజర్ శ్రీనివాస రావు, సంస్కృత విద్యాపీఠం ప్రధానాచార్యులు వాదిరాజాచార్, అధ్యాపకుడు కనకాచలాచార్ వ్యవహరించారు.

ఇసుక బుకింగ్‌కు రెండు కౌంటర్లు

కర్నూలు(టౌన్): జిల్లాలో ఇసుక బుకింగ్‌కు రెండు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని ఇప్పటికే కర్నూలు రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న జిల్లా గనుల శాఖ కార్యాలయంతో పాటు సి. బెళగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న గ్రామ సచివాలయంలో కౌంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు ఆధార్‌కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్, చిరునామా, ఇసుక రవాణా వాహనం ఆర్‌సీ బుక్ జిరాక్స్‌ను వెంట తీసుకురావాలన్నారు.

ఘనంగా తీజ్ నిమజ్జనం



నిమజ్జనం చేసేందుకు వెళ్తున్న లంబాడీ మహిళలు

కర్నూలు(అర్బన్): గోర్ బంజారాల తీజ్ ఉత్సవ నిమజ్జనం సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కైలాస్‌నాయక్ మాట్లాడుతూ.. ఏటా ఈ ఉత్సవాలను స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రారంభించి నిమజ్జనం చేసే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. గోర్ బంజారా ఉత్సవ కమిటీ నాయకులు రంగానాయక్, నాగరాజునాయక్, గూబ్రీ నాయక్, శంకర్‌నాయక్ తదితరుల సహకారంతో ఎంతో నిష్ఠ నియమాలతో మట్టి గంపల్లో విత్తనాలను వేసి ప్రతి రోజు నీళ్లు పోస్తు మొలకలు వచ్చిన తొమ్మిది రోజులకు నదిలో వదలడం ఆచారమన్నారు. ఎస్‌టీఎఫ్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు నేనావత్ రామునాయక్, సీమ కృష్ణ, రామాంజనేయ, జయరాంనాయక్, బంజారా మహిళలు పాల్గొన్నారు.

28 నుంచి డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 28వ తేదీ నుంచి డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నంద్యాల పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కర్నూలు సుంకేసుల రోడ్‌లోని సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరీక్షలకు మొత్తం 1,145 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. హాల్ టికెట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ వద్ద, లేదా ఆన్‌లైన్‌లోనూ పొందవచ్చన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కర్నూలు సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్ స్థానంలో జీపీఎస్, యూపీఎస్ పింఛన్ విధానాలను తీసుకురావాలనే ఆలోచనను విరమించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి డిమాండ్ చేశారు. స్థానిక సలాంఖాన్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఎస్టీయూ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గ్రాట్యూటీ, పీఆర్‌సీ, కుటుంబ పెన్షన్, కారుణ్య నియమకం తదితర సౌకర్యాలు ఉన్న పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. ఎస్టీయూ నాయకులు సురేష్, దేవదాసు, హనుమంతు, శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పని గంటలను కుదించాలి



నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) ఇటీవల కొన్ని గైడ్‌లైన్స్ రూపొందించింది. అందులో ఏ ఒక్క పీజీ నిరంతరంగా 24 గంటలకు మించి పనిచేయకూడదని పేర్కొంది. దీనిని అన్ని బోధనాసుపత్రుల్లో అమలు చేయాలి. మన వద్ద పనిచేసే పీజీలు 36కు గంటలు నిరంతరం పనిచేస్తున్నారు. వీరు వారానికి 74 గంటలు మాత్రమే పని చేసే విధంగా విధానాలు రూపొందించాలి. కోల్‌కతా లాంటి ఘటనలు జరగకుండా బోధనాసుపత్రుల్లో పోలీస్ భద్రతను పెంచాలి.

–డాక్టర్ కె. నాగిరెడ్డి, సైకియాట్రిస్ట్, కర్నూలు



ప్రత్యేకంగా భద్రత చట్టం అవసరం



పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతా మెడికల్ కళాశాల ట్రైనీ డాక్టర్ పై అత్యాచారం, హత్యకు చేసిన నిందితులను ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలి. దేశంలో వైద్యులకు రక్షణ లేకుండా పోయింది. మహిళ డాక్టర్లకు రక్షణ కల్పించే దేశవ్యాప్తంగా ప్రత్యేకంగా భద్రత చట్టం అమలు చేయాలి. డాక్టర్ల పై ఒత్తిడి తగ్గించాలి.

– డాక్టర్ మనోజ్‌కుమార్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, కోసిగి

సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి



దేశంలో అన్ని బోధనాసుపత్రుల్లో సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి. ప్రభుత్వ కాలేజీల్లో పీజీలకు సరైన వసతులు, సౌకర్యాలు ఉండటం లేదు. వారు ఇక్కడికి చదువుకోవడానికి వచ్చారు. చదువుతూ వైద్యం చేస్తారు. కానీ వారు చదువుకోవడానికి సమయం ఇవ్వడం లేదు. దీనికితోడు నిరంతరం డ్యూటీలు వేస్తున్నారు. నైట్ డ్యూటీ వస్తే మరుసటి రోజు కూడా పనిచేయాల్సి వస్తోంది. వారికి డే ఆఫ్‌లు కూడా ఉండటం లేదు. సుప్రీం కోర్టు కూడా వీరి డ్యూటీలపై సీరియస్ అయ్యింది. ఇలాంటి సమస్యలకు ఎన్ఎంసీ కొన్ని గైడ్‌లైన్స్ రూపొందించింది. అన్ని టీచింగ్ కాలేజీలు వీటిని అమలు చేయాలి.

–డాక్టర్ జి. సుధాకర్, చిన్నపిల్లల వైద్యులు, కర్నూలు

పారి'చోద్యం'

- మురికికూపాలుగా గ్రామీణ ప్రాంతాలు
- పల్లెల వైపు కన్నెత్తి చూడని పంచాయతీ కార్యదర్శులు
- మూలనపడిన ఫాగింగ్ మిషన్లు, ట్రై సైకిళ్లు
- పాఠశాలల పరిసరాల్లో కూడా పేరుకుపోయిన చెత్తాచెదారం
- నిరుపయోగంగా మారిన ఎస్‌డబ్ల్యూపీఎస్ షెడ్లు
- రోగాల బారిన గ్రామీణ ప్రజలు

ఏ పల్లె చూసినా ఏమున్నది గర్వకారణం.. రోడ్ల నిండా చెత్త.. డ్రెయినేజీల్లో తొలగని మురుగు.. కప్పలు తెప్పలుగా దోమలు.. పందుల సైర్యవిహారం...పట్టించుకోని పంచాయతీ సిబ్బంది.. వెరసి పల్లె ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వ్యాధుల విజృంభణతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ప్రభుత్వంలో చలనం ఉండటం లేదు. అధికారులూ స్పందించడం లేదు. పారిశుద్ధ్యం పడకేసి పల్లె ప్రాంతాలు రోగాలకు కేంద్రాలుగా మారుతున్నాయి.



దేవనకొండ మండలం బేతపల్లిలో పాఠశాల పక్కనే పేరుకుపోయిన చెత్తా చెదారం

కర్నూలు(అర్బన్): జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీలు 484 ఉండగా.. వీటిలో రెగ్యులర్, కాంట్రాక్టు పారిశుద్య కార్మికులు 300 మంది పనిచేస్తున్నారు. వీరితోపాటు క్లాప్ మిత్రలు 1,529 మంది, షెడ్ మిత్రలు 303 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగా ఉండటంతో పంచాయతీ కార్యదర్శులు పల్లెలను పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాలు మురికి కూపాలుగా మారుతున్నాయి. అపరిశుభ్ర వాతావరణానికి చిరునామాగా నిలుస్తున్నాయి. తగినంత మంది పంచాయతీ కార్యదర్శులు లేకపోవడం, ఒక్కో కార్యదర్శి మూడు నుంచి నాలుగు గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్‌గా ఉన్న కారణంగా కూడా వారు అన్ని గ్రామాలపై దృష్టి సారించలేక పోతున్నారు. కోసిగి మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. కౌతాళం, హొళగుంద, ఆదోని తదితర మండలాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొనింది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి సంబంధించి మెజారిటీ గ్రామ పంచాయతీలకు రెగ్యులర్ కార్యదర్శులు లేకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పారిశుద్ధ్య సమస్య తాండవిస్తోంది. గ్రామాలను పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచేందుకు గత నెల 19 నుంచి ఈనెల 15వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలను నిర్వహించినా..' ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ' అనే సామెతను గ్రామాలు తలపిస్తున్నాయి.



ఆలూరు - ఎల్లార్తి రోడ్డు సమీకృత వసతి గృహం సమీపంలో మురుగునీరు

'చెత్త'శుద్ధి ఏదీ?

మెజారిటీ గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణ అంతంత మాత్రంగానే జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించేందుకు మేజర్ గ్రామ పంచాయతీల్లో లక్షల రూపాయల ఖర్చుతో ట్రాక్టర్లు, ఆటోలు, మూడు చక్రాల ట్రై సైకిళ్ల కొనుగోలు చేశారు. ట్రాక్టర్లను మినహాయిస్తే అయితే, మిగిలిన వాటి నిర్వహణలో లోపం కారణంగా పలు గ్రామ పంచాయతీల్లో ట్రై సైకిళ్లు, ఆటోలు మూలన పడ్డాయి. ఇంటింటికి వెళ్లి ప్రతి రోజు చెత్తను సేకరించాల్సి ఉన్నా, పలు పంచాయతీల్లో సంబంధిత అధికారులకు మస్టర్లు వేసేందుకు కూడా తీరిక లేనట్లు వ్యవహరిస్తున్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాల భారాన్ని శానిటరీ మేస్త్రీలపై వేసి కార్యాలయాల్లో వారు కాలక్షేపం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో మేజర్ గ్రామ పంచాయతీల్లోని పలు వీధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. పైగా డ్రైనేజీలను కూడా నిర్ణీత సమయానికి శుభ్రం చేయకపోవడం వల్ల డ్రైన్ల నుంచి మురికి నీరు రోడ్లపైకి ఎక్కి ప్రవహించడంతో రోడ్లు మురగుమయంగా మారుతున్నాయి. సీసీ రోడ్లు అయితే త్వరగా ఆరిపోతున్నా, పల్లెల్లోని మట్టి రోడ్లపై ఈ మురుగు ప్రవహించడం వల్ల వీధులన్ని మురుగుమయంగా మారుతున్నాయి. తద్వారా ఆయా గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి.

పూర్తికాని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు

ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను సాలీడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ)లకు తరలించాల్సి ఉంది. జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లో ఈ షెడ్లను ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. ఒక్కో షెడ్డుకు రూ.7 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు 65 షెడ్లు పూర్తి అయినట్లు అధికారులు చెబుతున్నారు. వివిధ దశల్లో ఉన్న వాటిని అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ షెడ్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో షెడ్ల సమీపంలోనే చెత్తను డంప్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా చేయడం వల్ల కూడా ఆయా ప్రాంతాల్లో వాతావరణం కలుషితం అవుతోంది.



నిర్వహణ లేక మూలపపడ్డ ట్రై సైకిళ్లు



ఆలూరులో నిరుపయోగంగా మారిన ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం

అస్తవ్యస్తం.. అధ్వానం

- పట్టణాల్లో పడకేసిన పారిశుద్ధ్యం

కర్నూలు (టౌన్): పట్టణాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడి మురుగు అక్కడే నిలిచి రోడ్లెక్కి పారుతోంది. కర్నూలు కార్పొరేషన్‌తో పాటు ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీల్లో, గూడురు నగర పంచాయతీలో అపరిశుభ్రత తాండవిస్తోంది. కర్నూలు నగరంలో 17 పారిశుద్ధ్య డివిజన్లు ఉండగా.. రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులు 1,100 మంది పనిచేస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు 17 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి రోజూ 180 మెట్రిక్ టన్నుల చెత్త తరలించాల్సి ఉంది. మొత్తం 64 చెత్త వాహనాలు ఉన్నా.. పర్యవేక్షణ లేకపోవడంతో ప్రధాన వీధుల్లో చెత్తాచెదారం కనిపిస్తోంది. కర్నూలును స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుతామని మంత్రి టీజీ భరత్ ప్రకటించారే తప్ప.. నిధుల మంజూరుపై శ్రద్ధ చూపడం లేదు. ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా.. ప్రతి రోజు 35 మెట్రిక్ టన్నుల చెత్తను తరలించాల్సి ఉంది. మొత్తం 170 మంది కార్మికులు పనిచేస్తున్నా.. శివారు కాలనీల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ఆదోని మున్సిపాలిటీలో 42 వార్డులు ఉండగా.. ప్రతి వార్డుకు ఒక ఆటో చొప్పున 42 చెత్త తరలించే వాహనాలు ఉన్నాయి. ఇప్పుడవి 23కే పరిమితం అయ్యాయి. ప్రతి రోజు నగరంలో 14 మెట్రిక్ టన్నుల చెత్తను తరలించాల్సి ఉండగా.. అరకొర చెత్త సేకరణ జరుగుతోంది. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ లేకపోవడంతో పట్టణాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు విజృంభిస్తుండటంతో రోగాల బారిన పడుతున్నారు.



కర్నూలు శ్రీరాంనగర్‌లో ఇళ్లముందే చెత్త కుప్పలు



బుధవారపేటలోని ఖాళీ స్థలంలో దంప్ యార్డును తలపిస్తున్న చెత్త

చెత్తాచెదారం పేరుకుపోయింది



మా గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. పాఠశాల పక్కనే గుట్టలుగా చెత్తా చెదారం పేరుకుపోయింది. పిల్లలను పాఠశాలకు పంపాలంటే భయం వేస్తోంది. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోవడం లేదు. ఈ నెల 23వ తేదీన నిర్వహించిన గ్రామ సభలో కూడా అధికారులకు తెలియజేశాం. అయినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కోటేశ్వరనాయుడు, బేతపల్లి, దేవనకొండ మండలం

దుర్వాసన వస్తోంది



ఇటీవల వర్షాలు కురవడంతో వీధులన్నీ బురదమయమయ్యాయి. కనీసం డ్రైనేజీల్లో మురుగును తొలగించలేదు. మురికి నీరు రోడ్లపైకి ఎక్కి పారుతోంది. ఆలూరు – ఎల్లార్తి రోడ్డులో ఉన్న సమీకృత వసతి గృహం పక్కన మురుగునీరు నిల్వ ఉంది. ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తోంది. చెత్త సేకరణ కూడా అంతంతమాత్రంగానే ఉంది.

– దానాల రాజు, ఆలూరు

షోకాజ్ నోటీసులు ఇచ్చాం



గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య సమస్యపై ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవు. ఇప్పటికే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పలువురు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశాం. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు జూలై 19 నుంచి ఈ నెల 15వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాం. వంద రోజుల ప్రణాళికలో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపీసీలను అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం.

– టీ నాగరాజునాయుడు, జిల్లా పంచాయతీ అధికారి

బదిలీల జాతర.. కాసుల పంట

అధికారపార్టీ నేతలకు కాసులు కురిపిస్తున్న బదిలీలు

- కర్నూలు ఆర్డీవో పోస్టు రూ.కోటికి ఖరారు
- తక్కిన ఆర్డీవో పోస్టులకు బేరం. రూ.40 లక్షలు చెల్లించేందుకూ సిద్ధం
- తహసీల్దార్, ఎంపీడీవోల నియామకాల్లో జోరుగా పైరవీలు
- కోరుకున్న పోస్టింగ్ దక్కించుకునేందుకు నేతల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు
- బేరం కుదిరితేనే ప్రజాప్రతినిధులు సిఫార్సు లేఖలు
- కొందరు ఎమ్మెల్యేతో పాటు తెరపైకి ఎంపీల లేఖలు
- ఈ నెలాఖరులోపు పూర్తి కానున్న బదిలీల ప్రక్రియ



దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవడం అంటే ఇదే. అధికారాన్ని అడ్డుపెట్టుకుని జేబులు నింపుకునేందుకు అధికారపార్టీ నేతలు 'ఉద్యోగుల బదిలీ'లను వేదిక చేసుకున్నారు. తమకు తెలీకుండా బదిలీలు జరిగేందుకు వీల్లేదని ఉన్నతాధికారులకు హుకుం జారీ చేశారు. ప్రభుత్వం నుంచి కూడా ఎమ్మెల్యేల సిఫార్సుల మేరకు పోస్టింగ్‌లు పరిగణనలోకి తీసుకోండని మౌఖిక ఆదేశాలు ఉన్నాయి. దీంతో డబ్బుకోసం అర్రులు చాచిన నేతలు పోస్టులకు వెలకట్టి ద్వితీయశ్రేణి నేతలతో బేరసారాలు సాగిస్తున్నారు. ఆ తర్వాతే సిఫార్సు లేఖను చేతిలో పెట్టి 'బెస్టాఫ్..లక్' చెబుతున్నారు. డివిజన్, జిల్లాస్థాయి పోస్టులకు కూడా బేరసారాలు కొనసాగుతున్నాయి. సెలవులు పెట్టి పోస్టింగుల కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారంటే ఎంత డిమాండ్ ఉందో తెలుస్తోంది.

సాక్షి ప్రతినిధి కర్నూలు: తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడంతో తమ పార్టీ కార్యకర్తల ఆర్థిక ప్రయోజనాలే ధ్యేయంగా ఆ పార్టీ ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎస్‌పీడీసీఎల్, పురపాలక, రవాణా, ఎక్సైజ్ ఏఈలతో పాటు బదిలీలు చేస్తున్న 15శాఖలకు సంబంధించిన పోస్టులను తాము సిఫార్సు చేస్తూ లేఖలు ఇచ్చినవారికే ఇవ్వాలని కొందరు ప్రజాప్రతినిధులు ఆయా శాఖల ఉన్నతాధికారులకు హుకుం జారీ చేశారు. కొందరు ఇప్పటికే ఆయా స్థానాలకు ఏ అధికారిని నియమించాలని ఉన్నతాధికారులకు జాబితా కూడా ఇచ్చారు. బదిలీలపై ప్రభుత్వం ఈ నెల 17న నిర్ణయం తీసుకుని, ఈ నెలాఖరు వరకూ బదిలీల ప్రక్రియను పూర్తి చేసేలా నిషేధం ఎత్తేసింది. అయితే చాలామంది అధికారులు అప్పటికే ప్రజాప్రతినిధులను కలిసి విన్నపాలు విన్నవించారు. ఇప్పుడు బదిలీలకు రంగం సిద్ధం కావడంతో 'సిఫార్సులేఖ'ల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు.

సిఫార్సు లేఖల కోసం ప్రజాప్రతినిధుల ఇళ్లచుట్టూ ప్రదక్షిణలు

కోరుకున్న స్థానాన్ని దక్కించుకునేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. నేరుగా ప్రజాప్రతినిధులను కలవడంతో పాటు వారికి పరిచయమున్న వ్యక్తుల ద్వారా సిఫార్సు చేయించుకుంటున్నారు. 'మీరు చెప్పినట్లుగా నడుచుకుంటాను. మీ సూచనలు, నిర్ణయాలకు ఫేయిర్‌గా ఉంటాను. నాకు లెటర్ ఇవ్వండి సార్!' అంటూ ఇళ్లచుట్టూ తిరుగుతున్నారు. కొందరు అధికారులు నియోజకవర్గ ఎమ్మెల్యేతో పాటు ఎంపీ లెటర్ కూడా తీసుకుంటున్నారు. సిఫార్సు లేఖలు ఇచ్చేందుకు కొందరు ప్రజాప్రతినిధులు పోస్టును బట్టి రేట్ ఫిక్స్ చేస్తున్నారు. దీంతో కొందరు అధికారులు అంత డబ్బు ఇవ్వలేమని వెనకడుగు వేస్తుంటే, ఇంకొందరు పోస్టింగ్‌లో చేరిన వెంటనే ఒప్పుకున్న డబ్బులు ముట్టజెబుతామని ముందడుగు వేస్తున్నారు.

కీలక పోస్టులకు ఖరారైన అధికారులు

బదిలీలలో అత్యంత హాట్‌టాపిక్ అవుతోంది కర్నూలు ఆర్డీవో పోస్టు. ఈ పోస్టుకు కోటి రూపాయలు ఇస్తానని రాజధానిలోని ఓ మంత్రి ద్వారా ఒక డిప్యూటీ కలెక్టర్ ఖరారు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఓర్వకల్లుతో పాటు కర్నూలు చుట్టుపక్క 'రియల్‌ఎస్టేట్' వ్యవహారాలన్నీ కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండటంతో ఎలాగైనా సంపాదించుకోవచ్చని వీరు ఎంత చెల్లించేందుకుకైనా సిద్ధమైనట్లు తెలుస్తోంది. అలాగే పత్తికొండ, డోన్, ఆదోని, శ్రీశైలం, నంద్యాల ఆర్డీవో పోస్టులకు కూడా భారీ డిమాండ్ ఉంది. ఆదోనిలో ఐఏఎస్ కాకుండా డిప్యూటీ కలెక్టర్‌ను పోస్టింగ్ వేయించుకునేందుకు ఈ డివిజన్‌లోని ప్రజాప్రతినిధులు కూడా ప్రయత్నిస్తున్నారు. ఆర్డీవో పోస్టుల జాబితా దాదాపు ఖరారు కాగా.. సెక్రటేరియల్‌లో అన్ని టేబుళ్లు దాటి చివరగా సీఎం వద్దకు చేరినట్లు సమాచారం. అక్కడ ఆమోద ముద్ర పడగానే జీఓ విడుదల చేస్తారని తెలుస్తోంది. మళ్లీ మార్పులు, చేర్పులు లేకుండా ఈ నెల 30, లేదా 31న ఈ జాబితా విడుదల చేస్తారనే చర్చ జరుగుతోంది.

ఎంపీడీవోలు, తహసీల్దార్లదీ ఇదే పంథా

సిఫార్సు లేఖల కోసం ఎంపీడీవోలు, తహసీల్దార్లు కూడా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పలు మండలాలకు చెందిన టీడీపీ నేతలు తమ మండలానికి ఎంపీడీఓలు ఎవరు ఉండాలో నిర్ణయించి లేఖలు ఇచ్చారు. కొందరు ప్రజాప్రతినిధులు అధికారులకు లేఖ ఇచ్చినప్పటికీ, ఫోన్‌లో మరొకరి పేరు సిఫార్సు చేసి 'చేతివాటం' ప్రదర్శిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆలూరు, మంత్రాలయంలో అక్కడి టీడీపీ ఇన్‌చార్జ్‌లు సూచించిన వారికే పోస్టింగ్‌లు ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ఎక్సైజ్‌శాఖను తిరిగి పాత పద్ధతిలోనే కొనసాగించే యోచనలో ప్రభుత్వం ఉంది. కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. దీంతో సెబ్‌లోని సీఐ, ఎస్ఐలు కోరుకున్న చోట పోస్టింగ్ దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రవాణాశాఖలో ఆర్టీవోలు, ఎంవీఐలు కూడా కోరుకున్న పోస్టింగ్ కోసం 'లక్షలు' చెల్లించేందుకు సిద్ధమయ్యారు. ఇలా బదిలీల వ్యవహారంతో అధికారపార్టీ నేతలకు కాసుల పంట పండుతోంది. ఇప్పటికే 80శాతం మంది ఉద్యోగులకు స్థానాలు ఖరారయ్యాయి. తక్కిన 20శాతం 'బేరాలు' కుదిరిన తర్వాత ఈ నెలాఖరు లోపు ఆయా శాఖలకు బదిలీ ఉత్తర్వులు వెల్లడయ్యే అవకాశం ఉంది.



కర్నూలు విజ్ఞాన మందిరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణ భగవానుడు

ఆనంద గోవిందం

ఆబాలగోపాలం ఆనందడోలికల్లో మునిగి తేలింది. ఆనంద నందనుడిని మదిలో స్మరించుకుంది. శ్రీ కృష్ణాష్టమి పర్వదినం సోమవారం ఊరూవాడా కనుల పండువగా సాగింది. ఆలయాల్లో జనార్దనుడి అలంకరణ వెలుగులీనింది. నవనీత చోరుడికి నైవేద్యాలు సమర్పించి భక్తజనం భక్తిపారవశ్యంతో మునిగి తేలింది. గోవర్ధనగిరి ఎత్తి ప్రజలను రక్షించిన గోపాలుడిగా.. భగవద్గీత బోధించిన శ్రీకృష్ణ భగవానుడిగా.. అనేక రూపాల్లో నల్లనయ్య పూజలు అందుకున్నారు.

-కర్నూలు (కల్చరల్)

క్లుప్తంగా

రేపటి నుంచి బీపీఈడీ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు బీపీఈడీ, ఎంపీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు 235 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ పరీక్షను మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నందికొట్కూరు రోడ్డులోని సెయింట్ జోసెఫ్స్ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు..

రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పరీక్షలకు 46 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ పరీక్షను మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నందికొట్కూరు రోడ్డులోని సెయింట్ జోసెఫ్స్ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

టిప్పర్లు సీజ్

ప్యాపిలి: స్థానిక పెద్దపొదిళ్ల రోడ్డు సమీపంలో సోమవారం అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న ఐదు టిప్పర్లను సీజ్ చేసినట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఎర్రమట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. తరలించడానికి ఎర్రమట్టితో సిద్ధంగా ఉన్న ఐదు టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ సీజ్

నందికొట్కూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు తెలిపారు. సోమవారం బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా ఇసుక టిప్పర్, ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఒకే బిల్లుపై ఎక్కువ సార్లు ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి లోడుకు బిల్లు ఉండాల్సిందేనని లేని పక్షంలో ఇసుక లోడు వాహనాలను సీజ్ చేసి మైనింగ్ శాఖకు అప్పగిస్తామని చెప్పారు.

అవుకు రిజర్వాయర్‌లో గుర్తు తెలియని మృతదేహం



అవుకు: అవుకు రిజర్వాయర్‌లో టన్నెల్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ నుంచి అవుకు టన్నెల్ ద్వారా రిజర్వాయర్‌లోకి ఓ గుర్తు తెలియని వ్యక్తి శవం కొట్టుకు వచ్చిందని, ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వసుపత్రికి తరలించారు. దాదాపు ఆరు రోజుల క్రితం మృతి చెంది ఉండటంతో గుర్తు పట్టలేని స్థితిలో మృతదేహం ఉందని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజారెడ్డి సోమవారం తెలిపారు.

ఎల్లెల్సీలో..



పెద్దకడబూరు: మండల పరిధిలోని మేకడోణ గ్రామ సమీపంలోని సల్లమ్మవంక దగ్గర ఎల్లెల్సీలో గుర్తు తెలియన మృతదేహం కొట్టుకుపోతూ కనిపించింది. ఈ దృశ్యాన్ని చూసి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మృతి చెందిన వ్యక్తికి 40 సంవత్సరాలకు పైన వయస్సు ఉండవచ్చని, ఆత్మహత్య చేసుకున్నాడా.. ఎవరైనా హత్య చేసి కాలువలో పడేశారా అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఈ విషయంపై ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. మృతదేహం కొట్టుకుపోతుందన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అయితే మృతదేహం కనిపించలేదన్నారు.



బేతంచెర్ల: ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు, పెద్దలు



రుద్రవరం: ఇస్కాన్ టెంపుల్ వద్ద ఉట్టి కొడుతున్న యువకులు



ఆదోని: రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కృష్ణం వందే జగద్గురుం

శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రముఖ ఆలయాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. ఉట్లోత్సవంలో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలబాలికలు చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలో అలరించారు. ఇస్కాన్ ఆలయాల్లో భగవద్గీత పారాయణం చేశారు. శ్రీరాధా గోవిందులకు మహా శంఖాభిషేకం, 108 ఆహార పదార్థాలతో రాజభోగ నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణాల్లో, గ్రామాల్లో గోపాల కృష్ణుడి రథయాత్రలు వైభవంగా జరిగాయి. చిన్నారులు ప్రదర్శించిన కోలాటం, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

–సాక్షినెట్‌వర్క్



డోన్: పాతబస్టాండ్‌లో కొలువైన శ్రీకృష్ణుని విగ్రహం



కర్నూలు: గోశాలలో ప్రత్యేక అలంకారంలో వేణుగోపాల స్వామి



ప్యాపిలి: అలంకరణలో వీరనారాయణస్వామి



నంద్యాల: శ్రీచైతన్య మహాప్రభు మందిరంలో పూజలందుకున్న శ్రీకృష్ణ బలభద్ర, సుభద్రలు



కర్నూలు: కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



కోవెలకుంట్ల: శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆస్పరి: శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లుతున్న భక్తులు



కర్నూలు: గోకుల నందనుని రథయాత్రలో బాలికల కోలాటం

టీడీఆర్ బాండ్ల జారీలో గోల్‌మాల్

- నంద్యాల, నందికొట్కూరు మున్సిపాలిటీల్లో ఆక్రమాలు వెలుగులోకి

కర్నూలు (టౌన్): మున్సిపాలిటీల్లో టీడీఆర్ (ట్రాన్స్ఫరబుల్ డెవలప్‌మెంటు రైట్) బాండ్ల జారీలో గోల్‌మాల్ జరినట్లు తేలింది. ఈ నేపథ్యంలో నంద్యాల, నందికొట్కూరు మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులకు నోటీసులు జారీ చేశారు. నంద్యాల మున్సిపాలిటీలో పనిచేసి ప్రస్తుతం చిత్తూరు మునిసిపాలిటీలో అసిస్టెంట్ సీటీ ప్లానర్ గా వ్యవహరిస్తున్న జి. రామక్రిష్ణుడు, అలాగే నంద్యాల నుంచి కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కు వచ్చిన ఏసీపీ ఎస్. రంగస్వామి, నందికొట్కూరు మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎ. బాలమద్దయ్యలకు నోటీసులు జారీ చేశారు. వీరంతా టీడీఆర్ బాండ్లలో అక్రమాలు చేసినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. స్థల యజమానికి సమీపంలోని డిమాండ్ ఉన్న సర్వే నంబర్‌లోని మార్కెట్ విలువల ప్రకారం లబ్ధి చేకూర్చాలి. అయితే ఉన్నదాని కంటే అధికంగా విలువలు పెంచి యజమానులకు మేలు చేయడం ద్వారా ప్రభుత్వానికి నష్టం చేకూర్చే చర్యలకు పాల్పడినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. ఎందుకు అలా చేయాల్సి వచ్చిందన్న దానిపై నివేదిక సమర్పించాలని షోకాజ్ నోటీసుల్లో కోరారు. జిల్లాలోని కర్నూలుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. విజిలెన్స్ అధికారులు అన్ని మున్సిపాలిటీల్లో విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బనగానపల్లె సబ్ పోస్టాఫీసులో చోరీకి యత్నం



నగదును పరిశీలిస్తున్న అధికారులు

బనగానపల్లె: కొందరు దుండగులు బనగానపల్లె సబ్ పోస్ట్ ఆఫీస్‌లో చోరీకి యత్నించారు. అయితే కార్యాలయంలో ఉంచిన రూ. 8.16 లక్షలు దొంగలకు చిక్కక పోవడంతో పోస్టాఫీసు అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఇన్‌చార్జ్ పోస్టుమాస్టర్ దస్తగిరిరెడ్డి, సీఐ కృష్ణయ్య వివరాల మేరకు.. కార్యాలయంలో పని చేయు స్వీపర్ అంకలమ్మ సోమవారం ఉదయం శుభ్రం చేసేందుకు వెళ్లగా అప్పటికే తాళం ఊడిపోయి ఉండడం గమనించి అధికారులకు సమాచారం ఇచ్చింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ వెంటనే కర్నూలు డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంను రప్పించి దర్యాప్తు చేపట్టారు. కాగా కార్యాలయంలో ఉంచిన భారీ మొత్తంలో నగదు పెట్టెను దొంగలు గుర్తించకపోవడంతో రూ. 8.16 లక్షలు సేఫ్‌గా ఉన్నాయి. ఆ మొత్తం అంతా శనివారం రోజు సంబంధించిన కలెక్షన్ అని, ఆరోజు బ్యాంక్‌కు సెలవు కావడంతో కార్యాలయంలోనే ఉంచినట్లు పోస్టుమాస్టర్ దస్తగిరిరెడ్డి తెలిపారు. ఈ చోరీ యత్నం ఆదివారం అర్ధరాత్రి తరువాత జరిగి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలిసుకున్న నంద్యాల తపాలాశాఖ సూపరిండెంట్ శ్రీనివాసులు వెంటనే బనగానపల్లెకు చేరుకొని వివరాలను సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు.

గంరగోళంగా పీఆర్ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం సిటీ: జోన్-4 పరిధిలోని రాయలసీమ జిల్లాలకు చెందిన పంచాయతీరాజ్ ఇంజినీర్ ఉద్యోగులతో సహా అన్ని విభాగాల వారికి రీజనల్ కేంద్రమైన అనంతపురంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ చీఫ్ బి.బాలు నాయక్ సారథ్యంలో ప్రక్రియ సాగింది. మొత్తం 198 మంది ఉద్యోగులను కౌన్సెలింగ్‌కు పిలిచారు. అయితే బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు కౌన్సెలింగ్‌లో పాతరేశారు. గతంలో ఒక చోట పోస్టింగ్ వచ్చి మరో చోట డిప్యుటేషన్‌పై కొనసాగిన ఉద్యోగులు ఆయా స్థానాల్లోకి రెగ్యులర్ హోదాలో వచ్చేశారు. ఎటు తిరిగి వారంతా జిల్లా కేంద్రంలోనే ఏళ్ల తరబడి పాతుకుపోవడంతో ఉద్యోగంలో చేరినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తూ జిల్లా కేంద్రంలో పని చేయాలనుకున్న వారి కలలను కల్లలు చేశారు. సాక్షాత్తు ఈఎన్‌సీ వచ్చి నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా ఇంత అధ్వానంగా ఉంటుందని తాము ఊహించలేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలాఉంటే పీఏలను డీఈఈలుగా పంపిస్తారనుకుంటే వారిని ఒక చోట నుంచి మరో చోటుకు అదే హోదాలోనే పంపడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

గాలికుంటు నివారణకు టీకా తప్పనిసరి

కర్నూలు(అగ్రికల్చర్): పశువులకు సోకే వ్యాధుల్లో ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధి నివారణ టీకాతోనే సాధ్యమని ఉమ్మడి కర్నూలు జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు తెలిపారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఈ వ్యాధిని కలుగచేసే వైరస్ గాలి ద్వారా 60 కిలోమీటర్లకు పైగా త్వరితగతిన ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తుందన్నారు. వ్యాధి సోకడం వల్ల మరణాల శాతం తక్కువగా ఉన్నప్పటికీ పశువుల్లో ఉత్పాదక శక్తి సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. గాలికుంటు వ్యాధి చికిత్స వ్యయ ప్రయాసలతో కూడుకున్నందున నివారణ మార్గాలపై శ్రద్ధ వహించాలన్నారు. టీకాలు మొదటిసారి 2 నెలల వయస్సులో, బూస్టర్ డోస్ ఒక మాసం తర్వాత వేయించాలని.. ఆ తర్వాత ఏడాదికొకసారి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. టీకాలు వేసిన తర్వాత 1-3 వారాల్లో వ్యాధినిరోధక శక్తి పెంపొంది ఏడాది పాటు వ్యాధి సోకకుండా ఉంటుందన్నారు. నిండు చూడిగా ఉన్న పశువులకు ఈనిన తర్వాత టీకాలు వేయిస్తే మంచిదన్నారు. జిల్లాలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ఈ నెల 20 నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం మొదలైందన్నారు. వచ్చే నెల 18 వరకు కొనసాగుతుందన్నారు. కర్నూలు జిల్లాకు 3,25,800.. నంద్యాల జిల్లాకు 3,72,600 డోసుల టీకాలు సరఫరా చేశామన్నారు.

బనవాసి.. 'ఘనీకృత' కీర్తి

- వీర్యోత్పత్తిలో అగ్రస్థానం
- వరుసగా మూడో పర్యాయం 2024లో ఏ-గ్రేడ్‌గా గుర్తింపు



ఎమ్మిగనూరు: బనవాసి ఫారంలోని ఘనీకృత వీర్య కేంద్రం దేశంలోనే పేరు గాంచింది. ప్రతి మూడేళ్లకొకసారి చేపట్టే గ్రేడింగ్‌ల్లో వరుసగా మూడో పర్యాయం 2024లో ఈ కేంద్రానికి ఏ-గ్రేడ్ వచ్చింది. ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 1985-86 సంవత్సరంలో ఈ కేంద్రాన్ని బనవాసిలో ఏర్పాటు చేశారు. మొత్తం 8.98 ఎకరాల్లో ఈ కేంద్రం విస్తరించి ఉంది. నాణ్యత గల వీర్యాన్ని మేలు జాతి ఆబోతుల నుంచి ఉత్పత్తి చేసి తద్వారా పాల ఉత్పత్తిని పెంచే గేదెలు, ఆవులను సృష్టించడం, కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా నాణ్యత గల దూడలను ఉత్పత్తి చేయడం ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశాలు.

రాష్ట్రంలో అత్యుత్తమ కేంద్రం

రాష్ట్రంలోని విశాఖ, నంద్యాల, బనవాసిలలో మూడు వీర్య ఆబోతు కేంద్రాలు ఉన్నాయి. అందులో బనవాసి అత్యుత్తమ కేంద్రంగా నిలిచింది. ఈ ఏడాది విశాఖ, నంద్యాల కేంద్రాలకు బీ గ్రేడ్ రాగా.. బనవాసికి ఏ గ్రేడ్ వచ్చింది. ఇక్కడ మేలు జాతి పశు సేకరణ మొదలు వీర్య ఉత్పత్తి, సరఫరా వరకు ప్రతి అంశాన్ని సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ దృక్పథాన్ని మేళవించి చేపడుతున్నారు. ఐదు ప్రధాన జాతి సంతతిని ఇక్కడ ఉత్పత్తి చేసేందుకు కొన్ని దశాబ్దాలుగా కృషి జరుగుతోంది. ముర్రజాతి, జెర్సీక్రాస్(సంకరజాతి జెర్సీ-సీబీహెచ్‌ఎఫ్), ప్యూర్ జెర్సీ(హెచ్‌ఎఫ్), మెహసానా, గిర్, ఒంగోలు రకాలు కలిపి మొత్తం 89 వీర్య ఉత్పత్తి పశువులు ఉన్నాయి.

ప్రత్యేక పర్యవేక్షణ

ఘనీకృత వీర్య కేంద్రాన్ని ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్నారు. పశువుల ఆరోగ్య పరిరక్షణను వైద్యాధికారులు, వీర్య సేకరణ, పరీక్షలను నిపుణులైన శాస్త్రవేత్తలు చేపడుతున్నారు. ఆబోతులకు దాణా సరఫరా చేయడం, వ్యాధి నిరోధక టీకాలు వేయడం చేస్తున్నారు. గొంతువాపు, గాలికుంటు, తెలిరియస్, ఆంత్రాస్ వంటి వ్యాధులను ఎప్పటికప్పుడు నిర్ధారించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ కోసం రక్తనమూనాలు, పేడ, మూత్రంను బెంగళూరులోని ఎస్‌ఆర్‌డీడీఎల్ ల్యాబ్‌కు పంపుతున్నారు.

మేలు జాతి పశుగ్రాసం

ఘనీకృత వీర్య కేంద్రంలోని పశువుల పోషణకు మేలుజాతి పశుగ్రాసాన్ని పెంచుతున్నారు. ఇందుకు గాను ప్రభుత్వం 400 ఎకరాల అటవి భూమి కేటాయించింది. ప్రస్తుతం 130 ఎకరాల్లో పశుగ్రాసాన్ని సాగుచేస్తున్నారు. ప్రధానంగా సూపర్ న్యాపియర్, ప్యారా గ్రాస్‌ను పచ్చగడ్డి రూపంలో, జొన్న, కో-1, కో-4, మైజే, జవార్, ఫోడర్‌స్టార్ వంటి పశుగ్రాసాలను ఎండుగడ్డి కోసం సాగుచేస్తున్నారు.

ఈ ఏడాది 13లక్షల దోసుల వీర్యోత్పత్తి

మంచి నాణ్యత గల వీర్యాన్ని ఉత్పత్తి చేయడంలో బనవాసి ఘనీకృత వీర్య కేంద్రం తెలుగు రాష్ట్రాల్లో ప్రథమ స్థానంలో ఉంది. ఇక్కడ ప్రతి యేటా లక్ష్యానికి మించి ఉత్పత్తి జరుగుతోంది. ఈ యేడాది 13 లక్షల డోసుల ఉత్పత్తి లక్ష్యంగా ఇవ్వగా.. మూడున్నర నెలల్లోనే నాలుగు లక్షల డోసులు ఉత్పత్తి చేశారు. మిగిలిన 9 లక్షల డోసుల లక్ష్యాన్ని కూడా చేరుకుంటామని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉత్పత్తి చేసిన వీర్యాన్ని రాష్ట్రంలోని కడప, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, కృష్ణ, కాకినాడ, తాడేపల్లిగూడెంలకు, తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కర్ణాటకలోని హావేరి, బెల్‌గాంలకు, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, రాజస్థాన్‌లకు కూడా బనవాసి వీర్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఈ కేంద్రంలో డిప్యూటీ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉండగా..ఇద్దరు ఏడీఏలు, ముగ్గురు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు, ముగ్గురు వెటర్నరీ అసిస్టెంట్లు, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, 25 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు.



సేకరించిన వీర్యాన్ని పరీక్షిస్తున్న నిపుణులు

ప్రత్యేక గుర్తింపు



బనవాసి ఘనీకృత వీర్య కేంద్రానికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. మేలుజాతి పశువుల ఉత్పత్తికి ఇక్కడి నుంచి వీర్యాన్ని పంపించాలని వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి డిమాండ్ వస్తోంది. సమష్టి కృషితో లక్ష్యాన్ని సాధిస్తున్నాం. ఇక్కడ ఏర్పాటవుతున్న షీప్ అండ్ గోట్ రీసెర్చ్ సెంటర్‌నుంచి త్వరలో మేకపోతుల వీర్యోత్పత్తి ప్రారంభించనున్నాం.

– డాక్టర్ చంద్రశేఖర్‌రావు, ఇన్‌చార్జ్ డీడీ, పశుసంవర్ధక శాఖ



సీబీజేవై జాతి రకం



సీబీజేఫ్ రకం



ముర్రజాతి రకం ఆబోతులు